క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భువనగిరి : పట్టణంలోని అర్బన్‌కాలనీలోని 11కేవీ ఫీడర్ మరమ్మతులు కారణంగా శనివారం అర్బన్‌కాలనీ, శ్రీరాంనగర్, కాకినాడబస్తీ, ఓల్డ్ వివేరా ఓటల్ బ్యాక్ సైడ్‌లో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పట్టణ విద్యుత్ ఏఈ సాయికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అధికారులకు సహకరించాలన్నారు.

23న ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని గిరిజన గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీలలో ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 23న మిర్యాలగూడెంలో అవంతిపురంలోని గిరిజన గురుకుల కళాశాలలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు తమ ఒరిజినల్ ధృవపత్రాలతో హాజరు కావాలన్నారు. సమాచారం కోసం 8185973016, 9346436829 నంబర్లను సంప్రదించాలన్నారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

ఆలేరురూరల్ : ఆలేరు మండల పరిషత్ కార్యాయలంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా పడింది. ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం ప్రారంభమైన సమావేశానికి ఎంపీపీ, ఎంపీటీసీలు ఎవరు హాజరు కాలేదు. దీంతో మొదట గంటపాటు సమావేశాన్ని వాయిదా వేశారు. అనంతరం తిరిగి సభ ప్రారంభించిన ఎవరు హాజరు కాకపోవడంతో వచ్చే వారానికి వాయిదా వేస్తునట్లు ఎంపీడీఓ ఎంపీఓ సత్యేంద్రప్రసాద్ తెలిపారు.

ఉద్యమకారులకు గుర్తింపు కార్డులివ్వాలి

భువనగిరి : తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం భువనగిరి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సురుపంగ గణేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల లో భాగంగా ఇచ్చిన హమీలను వెంటనే అమలు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలంతో పాటు గుర్తింపుకార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మోత్కూరు : మండలంలోని పాలడుగు గ్రామంలో శుక్రవారం బీజేపీ గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బరిగెల శేఖర్, ఉపాధ్యక్షులుగా గునగంటి అలేందర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు గూడె మధుసూదన్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

సంస్థాన్ నారాయణపురం:మండలంలోని రాచకొండ గ్రామ మాజీ సర్పంచ్ కడిలబావితండాకు చెందిన పానుగోత్ లోక్యానాయక్(80) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. లోక్యానాయక్ మృతదేహాన్ని పలువురు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాంగ్రెస్ నాయకుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

చౌటుప్పల్ : పట్టణ కేంద్రానికి చెందిన 10వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకుడు పల్సం శ్రీనివాస్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కమిటీ అధ్యక్షుడు సుర్వి నర్సింహ గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. వ్యక్తిగత దాడులను పార్టీకి రుద్దవద్దన్నారు. శ్రీనివాస్‌పై జరిగిన దాడికి స్థానిక ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేదన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు.

కోనోకార్పస్ చెట్లు తొలగించాలని వినతి

భువనగిరిటౌన్ : మున్సిపాలిటీలో పరిధిలో గల కోనోకార్పస్ చెట్లు తొలగించాలని కోరుతూ 26వ వార్డు కౌన్సిలర్ ఈరపక నర్సింహ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రామంజుల రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కోనోకార్పస్ చెట్లతో శ్వాసకోశ సంబంధ వ్యాధులు వ్యాపిస్తున్నాయని ప్రాణాంతకర చెట్లను తొలగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

అందుబాటులో జీలుగ, జనుము విత్తనాలు

రామన్నపేట : రామన్నపేట సింగిల్‌విండో కార్యాలయంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయనీ పీఏసీఎస్ సీఈఓ జి.జంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ు. 30 కిలోల జీలుగ బ్యాగు సబ్సిడీపై రూ. 1116లకు సబ్సిడీపై ఇవ్వనున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో సబ్సిడీపై జీలుగ, పిల్లి పెసర, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనల తెలిపారు. 30 కిలోల జీలుగ బ్యాగు సబ్సిడీపై రూ. 1116లకు, 40కిలోల జనుము సబ్సిడీపై రూ. 1448లకు, 20కిలోల పిలిపిసర సబ్సిడీపై రూ. 1084లకు అందచేయనున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు పీఏసీఎస్‌ను సంప్రదించాలని కోరారు.

లో లెవల్ వంతెనలు.. తప్పని తిప్పలు

- ఏటా వర్షాకాలంలో మునుగుతున్న లో లెవల్ బ్రిడ్జిలు
- గ్రామాలకు నిలిచిపోతున్న రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- హైలెవల్ వంతెనలు నిర్మించాలని వేడుకోలు


గుండాల-నూనెగూడెం గ్రామాల మధ్య ప్రమాదకరంగా ఉన్న లో లెవల్ వంతెన


మరిపడిగ-సీతారాంపురం గ్రామాల మధ్యన ఉన్న లో లెవల్ బ్రిడ్జి

గుండాల : మండలంలోని పలు గ్రామాల మధ్య ఉన్న లో లెవల్ వంతెనలు ప్రమాదకరంగా మారాయి. ప్రతి ఏటా వర్షాకాలంలో లో లెవల్ వంతెనల పైనుంచి వరద ఉధృతంగా పారుతుండడంతో లో లెవల్ వంతెనలు ధ్వంసమై కొన్ని రోజుల పాటు రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఏటా పల్లె ప్రజలకు ఇవే కష్టాలు ఎదురవుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. లో లెవల్ వంతెనలు ఉన్న స్థానాల్లో హై లెవల్ బ్రిడ్జిలు నిర్మించాలని కోరుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు.

వర్షా కాలంలో వచ్చిదంటే వణుకే..

వర్షాకాలంలో లో లెవల్ కల్వర్టుల వద్ద వర్షాల కారణంగా వరద ఉధృతికి ప్రమాదాలు జరుగుతుండడం, అత్యవసర సమయాల్లో గ్రామాలు దాటలేని పరిస్థితులు నెలకొంటుండడంతో వర్షా కాలంలో వచ్చిదంటేనే మండలంలోని పలు గ్రామాల వణికిపోతున్నారు. మండలంలోని నూనెగూడెం, మరిపడిగ గ్రామాల మధ్య బిక్కేరు వాగుపై లో లెవల్ వంతెనలే ఉన్నాయి. వర్షా కాలంలో వంతెనలు పొంగిపొర్లుతుండడంతో ఆ గ్రామాలకు వెళ్లాలంటే ప్రజలు, రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాలు కురిసిన ప్రతిసారి నూనెగూడెం గ్రామానికి, మరిపడిగ గ్రామానికి వెళ్లాలంటే బండ కొత్తపల్లి గ్రామం మీదుగా దేవరుప్పుల నుంచి కడవెండి సీతారాంపురం మీదుగా ఆ గ్రామానికి చేరుకోవాల్సి వస్తుంది. భారీ వర్షాలకు విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేక పోతున్నారు. నూనెగూడెం-గుండాల బిక్కేరు వాగుపై నిర్మించిన కల్వర్టులు గతంలో కురిసిన భారీ వర్షాలకు తెగి కొట్టుకుపోయాయి. దీంతో తాత్కాలిక మరమ్మతులు చేసి రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో నూనెగూడెం, గుండాల బిక్కేరు వాగుపై నూతనంగా హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించిన ఫలితం లేకుండా పోయిందని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి హై లెవల్ బ్రిడ్జిలకు నిధులు మంజూరు చేసి పనులు త్వరితగతిన చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

హై లెవల్ వంతెనలు నిర్మించాలి



నూనెగూడెం-గుండాల బిక్కేరు వాగుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలని పలు మార్లు జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించిన ఫలితం లేకుండా పోయింది. వామపక్షాల ఆధ్వర్యంలో రెండు గ్రామాల రైతులను, ప్రజలను ఐక్యం చేసి బ్రిడ్జి నిర్మించాలని రాస్తారోకోలు, ధర్నాలు చేపట్టినప్పుడు తాత్కాలికంగా మరమ్మతులు చేశారే తప్పా శాశ్వత పరిష్కారం చూపలేదు. వర్షా కాలంలో రెండు గ్రామాల ప్రజలు, రైతులు రాకపోకలు నిలిచి పోతున్నాయి. హై లెవల్ బ్రిడ్జికి నిధులు కేటాయించి పనులు చేపట్టాలని కోరుతున్నాం.

– మద్దెపురం రాజు, గుండాల

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ఆర్ఐకి వినతిపత్రం అందజేస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

మోత్కూరు : చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీనర్సయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్ఐ సుమన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చి హామీ మేరకు ప్రభుత్వం చేనేత భరోసా విధి విధానాలు రూపొందించి అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వం చేనేత సహకార సంఘాలను నిర్వీర్యం చేసిందన్నారు. సహకార సంఘాలకు గత పది సంవత్సరాలుగా ఎన్నికలు నిర్వహించకుండా సంఘాలను బలహీన పరిచిందన్నారు. చేనేత మిత్ర పథకం కింద నూలు సబ్సిడీ, చేనేత చేయూత కింద త్రిఫ్ట పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులు ఉత్పత్తి చేస్తున్న వస్త్రాలకు మార్కెట్ లేదని, దీంతో చేనేత కార్మికులకు పని కల్పించే మాస్టర్ వీవర్స్ సహకార సంఘాలు పని కల్పించడం లేదన్నారు. సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పోచం కన్నయ్య, వంగరి రాములు, పోచం భిక్షపతి, పోచం నారాయణ, జెల్ది సోమ య్య, చంద్రమౌళి, అంబదాసు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వాలని వినతి

భువనగిరిటౌన్ : మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఏశాల అశోక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలని కోరుతూవినతి పత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూమ్ నిర్మాణం పూర్తయి సంవత్సరాలు గడుస్తున్న డ్రాలో ఎంపికైన లబ్ధిదారులకు ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించి వెంటనే డ్రాలో ఎంపికైన లబ్ధిదారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ధర్నాలు రాస్తారోకాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబితా, కార్యదర్శి పుట్ట రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వస్తువుల అభిలాష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి లక్ష్మయ్య, పట్టణ సహాయ కార్యదర్శి చింతల మల్లేశం, నాయకులు చిక్క నరసయ్య పాల్గొన్నారు.

పండ్లు, ఆకుకూరలతో బీపీ నియంత్రణ


సదస్సులో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

చౌటుప్పల్ : ఉరుకులుపరుగుల జీవనం, మారుతున్న ఆహారపు అలవాట్ల వల్ల రక్తపోటు(బీపీ) పెరిగి ప్రాణాంతకంగా మారుతుందని డీఎంహెచ్ఓ డాక్టర్ పాపారావు పేర్కొన్నారు. ప్రస్తుతం సంభవిస్తున్న ఆకస్మిక మరణాలకు రక్తపోటు కూడా ప్రధాన కారణమని, పండ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవడం వల్ల బీపీని నియంతించవచ్చని తెలిపారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా శుక్రవారం చౌటుప్పల్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. అధిక బీపీ కారణంగా గుండె పోటు, పక్షవాతం వచ్చి ప్రపంచంలో ఏటా 16లక్షల మంది చనిపోతున్నారని పేర్కొన్నారు. 2025నాటికి దేశంలో రక్తపోటు బాధితల సంఖ్యను 25శాతానికి తగ్గించాలని డబ్ల్యూహెచ్ఓ నిర్ణయించిందన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరూ తమ ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని, బయట లభించే జంక్ ఫుడ్ వంటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రామకృష్ణ, సుమన్ కల్యాణ్, డిప్యూటీ డీఎంహెచ్ఓలు శిల్పిని, యశోద, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.సుమన్‌కళ్యాణ్, వైద్యాధికారి కాటం రాజు , మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, నాగేష్, ఇస్తారి, అశోక్, శశికళ పాల్గొన్నారు.

గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలి


మాట్లాడుతున్న పాశం భాస్కర్

భువనగిరి: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంఎస్ఆర్ గార్డెన్‌లో ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికల పై సమీక్ష, త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు.అనంతరం ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పొలిటికల్ కో ఆర్డీనేటర్ తాడూరి శ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతంశెట్టి రవీందర్, కర్నాటి ధనుంజయ్య, పడాల శ్రీనివాస్,గూడూరు నారాయణరెడ్డి, సీఎన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తన దుకాణాల తనిఖీ


మోటకొండూర్ : మనగ్రోమోర్‌లో స్టాక్ రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ సుబ్బూరి సుజాత


మోత్కూరు : విత్తనాల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ స్వప్న

మోటకొండూర్: మండల కేంద్రంతో పాటు కాటేపల్లి, ముత్తిరెడ్డిగూడెం గ్రామాల్లోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారిని సుబ్బూరి సుజాత శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రికార్డులను పరిశీలించారు. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం గుర్తింపు పొందిన దుకాణాలలో మాత్రమే రైతులు విత్తనాలను, ఎరువులను విక్రయించి వాటి బిల్లులు జాగ్రత్తగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో నల్లమాస రాజు, మధు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ-3 పత్తి విత్తనాలు విక్రయిస్తే చర్యలు

మోత్కూరు : బీటీ-3 పత్తి విత్తనాలకు ప్రభుత్వ అనుమతి లేదని ఆ విత్తనాలను గ్రామాల్లో విక్రయించినా, సాగు చేసిన చర్యలు తీసుకుంటామని ఏఓ కల్యూరి స్వప్న అన్నారు. శుక్రవారం మున్సిపల్ కేంద్రంలోని పలు విత్తన, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు విధిగా రశీదులు అందజేయాలన్నారు. లైసెన్సులు కలిగిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు, ఎరువులను రైతులు కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాల రశీదులను పంట కాలం పూర్తయ్యేంత వరకు భద్రపరచుకోవాలన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని శివారెడ్డిగూడెం గ్రామానికి చెందినబాతరాసి శ్రీకాంత్‌కు మంజూరైన రూ.2.50 లక్షల ఎల్ఓసీని శుక్రవారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఉప్పునూతుల వెంకటేశం, మేకల సంజీవరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు మేకల రామకృష్ణారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, చిలుకల సంతోష్, సరసాని వెంకట్‌రెడ్డి, నారి మహేశ్, పెద్దిరెడ్డి బుచ్చం తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో జాప్యంపై ఆందోళన

ఆత్మకూరు(ఎం): ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని శుక్రవారం పలువురు రైతులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో 45 రోజులుగా 80 మంది రైతుల నుంచి 29.241 బస్తాలను కొనుగోలు చేశారన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి 40 రోజులు అవుతున్నా కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి కొనుగోళ్లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు బీసు చందర్ గౌడ్, మక్తాల హుస్సేన్, కోరె అశోక్ తదితరులు ఉన్నారు.

నాణ్యత లేని ఫుడ్ విక్రయిస్తే చర్యలు

చౌటుప్పల్ : నాణ్యత లేని ఫుడ్ విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్వాతి హెచ్చరించారు. పట్టణ కేంద్రంలోని తంగడపల్లి రోడ్డులోని బేకరీ, కిరాణ దుకాణంలో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆహార పదార్థాల శాంపిళ్లను సేకరించారు. పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తామని తెలిపారు. ఆమె వెంట పలువురు సిబ్బంది ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే పూర్తిచేయాలి


భువనగిరి రూరల్ : అనాజీపురం ఐకేపీ కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు


వలిగొండ : డిప్యూటీ తహసీల్దార్ పుష్పకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

భువనగిరి రూరల్ : ధాన్యం కొనుగోళ్లు వెంటనే పూర్తిచేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ డిమాండ్ చేశారు. మండలంలోని అనాజీపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గునుగుంట్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ బొల్లెపల్లి కుమార్, అబ్దుల్లాపురం వెంకటేశ్, ఏదునూరి వెంకటేశ్, దంగనబోయిన బాల్‌నర్సింహ, బొల్లెపల్లి స్వామి, బొల్లెపల్లి కిషన్, కడారి కష్ణ, శ్రీశైలం, రవి పాల్గొన్నారు.

వలిగొండ : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ పుష్ప కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ రైతులు మార్కెట్లో ధాన్యం నిల్వ చేసి రెండు నెలలు గడుస్తున్న లారీలు, గన్ని బ్యాగుల కొరతతో కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదన్నారు. దీంతో అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు పండించిన ధాన్యానికి 'ఏ గ్రేడ్' కిందనే కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గర్దాసు నరసింహ, కవిడే సురేష్, కందగట్ల సాయిరెడ్డి, వేముల లక్ష్మయ్య, వేముల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ : అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని పలువురు సీపీఎం నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎండీ.పాష, ఆకుల ధర్మయ్య, కరుణాకర్, శ్రీను, దాసు, స్వామి, లక్ష్మయ్య, నర్సింహ, కృష్ణ, రాములు, శివకుమార్,పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి


ఆత్మకూరు(ఎం) : రాయిగిరి - మోత్కూరు రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న నాయకులు, రైతులు

తుర్కపల్లి: రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిన్నపు రెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని, దొడ్డు రకం వడ్లకూ బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలకు రైతులు ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తడిసిన ధాన్యాన్ని బేషరుతుగా రైతుల నుంచి కొనుగోలు చేయాలని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ధర్నాలు, రాస్తారోకోలతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పలుగుల నవీన్‌కుమార్, గిద్దె కరుణాకర్, నాయకులు భూక్య రవీందర్‌నాయక్, శ్రీశైలం, భాస్కర్‌నాయక్, శ్రీనివాస్, రహమత్ షరిఫ్, బాల క్రిష్ణ, బాలరాజుగౌడ్, ప్రభాకర్, రాజు యాదవ్, బాల చంద్రయ్యగౌడ్, నవీన్, ఐలేశ్‌యాదవ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ఆత్మకూరు(ఎం): తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రాయిగిరి-మోత్కూరు రోడ్డుపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు శుక్రవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్, ఎంపీటీసీ యాస కవితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్, బీజేపీ జిల్లా నాయకుడు బొబ్బల ఇంద్రారెడ్డి, కోరె భిక్షపతి, నాయకులు గడ్డం దశరథ గౌడ్, బండారు సత్యనారాయణ, మజ్జిగ నరేష్, మామిడి శ్రీనువాస రెడ్డి, కొత్త భాస్కర్‌రెడ్డి, కొండపల్లి అబ్బసాయిలు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులకు 'అమ్మ ఆదర్శ' పాఠశాల నిధులు

సాక్షి ఎఫెక్ట్..

మోత్కూరు : మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'మన బస్తీ-మన బడి' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులు అర్ధాంతరంగా నిలి చిపోవడంపై శుక్రవారం సాక్షి దిన పత్రికలో అసంపూర్తిగా 'మన బస్తీ-మన బడి' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతులకు సంబంధించిన పనులపై కలెక్టర్ హన్మంతు కె జెండగే నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న పనులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన 'మన బస్తీ-మన బడి' కార్యక్రమంలో నిధుల కొరత ఉందని అమ్మ ఆదర్శ పాఠశాల కింద మంజూరైన నిధులతో అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారని ప్రధానోపాధ్యాయుడు టి.గోపాల్‌రెడ్డి సాక్షికి తెలిపారు.

వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

బొమ్మలరామారం : అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు, నాగినేనిపల్లి ఎంపీటీసీ పక్కీరు రాజేందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం పలువురు బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో జరుగుతున్న జాప్యానికి ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొలను చంద్రశేఖర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి,రవిశంకర్, జగ్గర్ల ఆనంద్ గౌడ్, మహేష్ గౌడ్,గోపాల్ గౌడ్, గంగాదేవి శ్రీశైలం, గుండోజి మోహన్ రావు పాల్గొన్నారు.

మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

భూదాన్‌పోచంపల్లి :వరంగల్ – ఖమ్మం – నల్లగొడ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యం ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సీత సుధాకర్ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో యువజన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో ఎన్ని అక్రమకేసులు బనాయించిన భయపడకుండా ప్రజల పక్షాన కొట్లాడిన వ్యక్తి తీన్మార్ మల్లన్న అని అన్నారు. నిరుద్యోగుల పట్ల ప్రశ్నించే గొంతుకగా నిలబడిన తీన్మార్ మల్లన్నను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి జినుకల జయసూర్య, పెంట నవీన్, గోలి నందు, కస్తూరి భాస్కర్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ప్రచారం

భువనగిరిటౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ట్రస్మా జిల్లా అధ్యక్షులు జలందర్ రెడ్డిని, సాయి కృప డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ యాకుబ్, పలువురు లెక్చరర్లను కలిసి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యత ఓటే వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు తంగళ్లపల్లి రవికుమార్, అతహర్, సలావుద్దీన్, గుమిడెల్లి రమేష్, రంజిత్, యువ న్యాయవాది ఎడమ ప్రవీన్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గతుకుల రోడ్లు.. ప్రయాణికుల పాట్లు

భూదాన్‌పోచంపల్లి : మండల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. కంకరతేలి గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసిన రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిలుస్తోంది. దీంతో వాహనదారులు, పాదచారులు గతుకుల రోడ్లపై ప్రయాణం చేయాలంటే నరకయాతన పడుతున్నారు. ఇంద్రియాల, శివారెడ్డిగూడెం గ్రామాల శివారులో గుంతల రోడ్డులో వర్షపునీరు నిలిచి గుంతలు గమనించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గౌస్‌కొండ, పెద్దరావులపల్లి రోడ్డు కంకరతేలి అధ్వానంగా తయారైంది. వంకమామిడి గ్రామశివారులో రోడ్డు లోతట్టుగా ఉండడంతో వర్షపునీరు నిలిచి మడుగును తలపిస్తుంది. దేశ్‌ముఖి శివారు, పిలాయిపల్లి గ్రామాల శివారులో కూడా రోడ్డులో గుంతలు ఏర్పడ్డాయి. అలీనగర్ వద్ద రోడ్డంతా బురదయమంగా మారింది. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


ఇంద్రియాల గ్రామ శివారులో రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షపు నీరు


అలీనగర్‌లో బురదమయంగా మారిన రోడ్డు


అధ్వానంగా ఉన్న పెద్దరావులపల్లి-గౌస్‌కొండ రోడ్డు


వంకమామిడి శివారులో మడుగును తలపిస్తున్న రోడ్డు